


**300 ఎకరాల్లో జీనోమ్ వ్యాలీ ఫేజ్- 2**

PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd




**బయ్యారంలో జామాయిల్ తోట దగ్ధం...**

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక - 59 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 05 రూ - 03/- బుధవారం 28 ఫిబ్రవరి 2024







# 'మహాలక్ష్మి', 'గృహ జ్యోతి' పథకాల ప్రారంభం...

■ మహాలక్ష్మి కింద రూ.500కే గ్యాస్ సిలిండర్ ■ గృహజ్యోతి కింద 200 యూనిట్ల లోపు ఉచిత కరెంట్ ■ గ్యారెంటీలను నమ్మి ప్రజలు గెలిపించారు: సీఎం రేవంత్‌రెడ్డి ■ అందుకే ఆర్థిక ఇబ్బందులున్నా పథకాల అమలు: సీఎం రేవంత్‌రెడ్డి ■ అపోహలొద్దు.. నూటికి నూరు శాతం అన్నీ అమలు చేస్తాం: సీఎం రేవంత్ ■ ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారికే ఈ పథకాల వర్తింపు ■ తెల్లరేషన్ కార్డు ఉన్నవారికే వర్తింపు ■ మహిళ పేరుపై గ్యాస్ కనెక్షన్ ఉంటేనే రూ.500 సిలిండర్ పథకం వర్తింపు

**హైదరాబాద్,ఫిబ్రవరి 27(పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలను నమ్మే ప్రజలు తమకు అధికారం ఇచ్చారని.. అందుకే ఆర్థిక ఇబ్బందులున్నా చిత్తశుద్ధితో ఒక్కో పథకం అమలు చేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం తెలంగాణ సచివాలయంలో అభయహస్తం గ్యారెంటీల అమలులో భాగంగా.. 'మహాలక్ష్మీ పథకం' 'గృహ జ్యోతి' పథకాలను ప్రభుత్వం ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌తో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులతో పాటు స్పీకర్ గడ్డం ప్రసాద్ పాల్గొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన పథకం ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని.. అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే రెండు హామీలను అమలు చేశామని సీఎం రేవంత్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. నూటికి నూరు శాతం అన్ని హామీలను అమలు చేస్తామని.. తెలంగాణ ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని అన్నారాయన. అలాగే.. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వాళ్లకే ఈ పథకాలు వర్తిస్తాయని మరోసారి స్పష్టత ఇచ్చారు. పేదల ఇళ్లలో వెలుగులు నింపాలనే 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ఇస్తున్నామని, అలాగే మహాలక్ష్మీ పథకం కింద సబ్సిడీతో రూ.500 సిలిండర్ అందిస్తున్నామని అన్నారు.

## ఎమ్మెల్సీ కోడ్ వల్లే..

ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని తుక్కుగుడలో సోనియా గాంధీ హామీ ఇచ్చారు. సోనియా గాంధీ హామీ మేరకు కాంగ్రెస్ కు ప్రజలు పట్టం కట్టారు. రెండు పథకాలను చేవెళ్ళలో ప్రారంభించాలి అనుకున్నాం. ఎమ్మెల్సీ కోడ్ వల్ల అక్కడి నుంచి సెక్రటేరియట్ కు మార్చాల్సి వచ్చింది. ప్రియాంక గాంధీ కోడ్ కారణంగా రద్దు చేసుకున్నారు.

వివరాలు 2లో

# కాంగ్రెస్ నేతలను ఆ విషయంలో విడిచిపెట్టం.. కేటీఆర్ మాస్ వార్నింగ్



**హైదరాబాద్,ఫిబ్రవరి 27(పిసిడబ్ల్యూ న్యూస్):** మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే విడిచే పెట్టే ప్రసక్తే లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు మాస్ వార్నింగ్ ఇచ్చారు. మంగళవారం నాడు అంబర్‌పేట బీఆర్ఎస్ సమ్మేళనంలో కేటీఆర్ పాల్గొని మాట్లాడుతూ... రాష్ట్రంలో జనం నుంచి ఒక్కటే మాట వినిపిస్తోందని.. తప్పుదారి కాంగ్రెస్‌కు ఎన్నికల్లో ఓటేశామని జనం అనుకుంటున్నారని చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను చూసి మోస పోయామని జనం చెబుతున్నారని అన్నారు. గ్రేటర్‌లో గోషామహల్ మినహా అన్ని తామే గెలిచామని చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన దొంగ హామీలను జనంలోకి

వివరాలు 2లో

# ఎంపీ ఎన్నికల్లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా: బండి సంజయ్



**కరీంనగర్,ఫిబ్రవరి 27(పిసిడబ్ల్యూ న్యూస్):** లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ తెలంగాణలో రాజకీయం రసవత్తరంగా మారుతోంది. ఈ క్రమంలోనే.. కాంగ్రెస్, బీజేపీ పార్టీల నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. ప్రధానంగా.. మంత్రి పొన్నం ప్రభాకర్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ మధ్య సవాళ్లు ప్రతిసవాళ్ల పర్వం జోరుగా సాగుతోంది. ఇప్పటికే.. ఆరు పేర్లతో ఎంపీ అభ్యర్థుల తొలి జాబితాను బీజేపీ విడుదల చేయగా.. అందులో కరీంనగర్ అభ్యర్థిగా మరోసారి బండి సంజయ్‌కు

వివరాలు 2లో

# ఖమ్మం లేదా భువనగిరి నుంచి రాహుల్ గాంధీ పోటీ..?



**హైదరాబాద్,ఫిబ్రవరి 27(పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణ నుంచి లోక్ సభ కు పోటీ చేయనున్నట్లు సమాచారం. ఖమ్మం లేదా భువనగిరి నుంచి బరిలో దిగుతారని తెలుస్తోంది. సోనియా ఖమ్మంలో పోటీ చేయాలని గతంలో టీపీసీసీ తీర్మానం చేసింది. కానీ ఆరోగ్యం, వయసు రీత్యా ఆమె రాజ్యసభకు నామినేట్ అయ్యారు. ఇక రాహుల్ గాంధీ కేరళలోని వయనాడ్ నుంచి ఎంపీగా ఉన్నారు. అక్కడ వయనాడ్ స్థానంలో కమ్యూనిస్టు పార్టీలు పోటీ చేయనున్నారు. అందుకే ఈ సారి .. తెలంగాణ నుంచి పోటీ చేయాలని అనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. ఇప్పటికే రాహుల్ టీం .. తెలంగాణ కాంగ్రెస్ ముఖ్యులతో సంప్రదింపులు జరిపింది. సర్వే రిపోర్టులు ఇతర అంశాలతో రెండు స్థానలను ఎంపిక చేసుకున్నారు. ఒకటి ఖమ్మం కాగా మరొకటి భువనగిరి. రెండు కాంగ్రెస్ పార్టీకి కంచుకోటలే. అయితే ఖమ్మం ఇంకా బలమైన సీటు. అక్కడ కాంగ్రెస్ కు ఇప్పుడు సరైన ప్రత్యర్థి లేదు. బీఆర్ఎస్ నుంచి నేతల వలసతో ఆ పార్టీ పూర్తిగా బలహీన పడింది. ద్వితీయ శ్రేణి క్యాడర్ కూడా పార్టీ మారిపోయింది. బీజేపీ ఉనికి దాదాపుగా లేదు. దీంతో ఖమ్మంలోనే రాహుల్ పోటీ చేయడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు. రాహుల్ పోటీ చేస్తే ఎన్నికల్లో మరింత ప్రభావం ఉంటుందని కాంగ్రెస్ నేతల అంచనా. ఈ విషయంపై చీఫ్ ఖర్గేతో రేవంత్ చర్చించారని, దీంతో రాహుల్ అంగీకరించినట్లు వార్తలు వస్తున్నాయి.

# తెలంగాణలో ఇంటర్ పరీక్షలు...

**హైదరాబాద్,ఫిబ్రవరి 27(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో రేపటి నుంచి మార్చి 19 వరకు ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. 9.80 లక్షల మంది విద్యార్థులు ఎగ్జామ్స్ రాయనున్నారు. నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు. పరీక్షల సమయంలో విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించే ందుకు టెలిమానస్ ద్వారా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థులు 14416 టోల్ ఫ్రీ నంబర్కు ఫోన్ చేయాలని, ఇది 24 గంటలూ అందుబాటులో ఉంటుందని చెప్పారు.అలాగే ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో సంబంధిత విద్యార్థులకు రవాణా సదుపాయం కల్పించేందుకు ఆర్టీసీ బస్సులను అందు బాటులో ఉంచాలని ఖమ్మం రీజియన్ పరిధిలోని అన్ని డిపోల మేనేజర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు వెంకన్న తెలిపారు. విద్యా ర్థులు ఉదయం 8 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా మార్గదర్శకాలు రూపొందించినట్లు వెల్లడించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఇదిలా ఉంటె తెలంగాణ ఇంటర్మీడియట్వార్షిక పరీక్షలకు హాల్టికె ట్లు విద్యార్థులే తమ హాల్టికెట్లను నేరుగా పొందేలా అధికార వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచింది. ప్రథమ ఇంటర్విద్యార్థులైతే ఎస్ఎస్సీ హాల్టికెట్నెంబరు, పుట్టిన తేదీని ఎంటర్చేయడం ద్వారా హాల్టికెట్లు పొందొచ్చు. ద్వితీయ ఇంటర్విద్యార్థులైతే రోల్నంబరు, గత ఏడాది హాల్టికెట్నంబర్, పుట్టిన తేదీ వివరాలను ఎంటర్చేసి పొందొచ్చు. బ్రిడ్జి కోర్సు విద్యార్థులైతే ఎస్ఎస్సీ పరీక్ష నంబరు, రోల్నంబరు, పుట్టిన తేదీ వివరాలనుఎంటర్చేయడంద్వారాహాల్టికెట్లను డౌన్లోడ్చేసుకోవచ్చు.



# ఎన్నికల్లో ఓటమి తప్పదని వారికి తెలుసు: ప్రధాని మోడీ

- రానున్న ఎన్నికల్లో తమకు ఓటమి తప్పదని వారికి తెలుసు - దేశ ప్రగతికి ప్రతిపక్షానికి రోడ్‌మ్యాప్ లేదు - కాంగ్రెస్, కమ్యూనిస్టులు కేరళలో బద్ధ శత్రువులు - ఇతర ప్రాంతాల్లో జిగ్రీ దోస్తులు: విరుచుకుపడిన ప్రధాని మోడీ



**తిరువనంతపురం,ఫిబ్రవరి 27(పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్రంలో భారతీయ జనతా పార్టీ (బిజెపి)కి వ్యతిరేకంగా బలమైన ప్రత్యామ్నాయ కూటమి ఏర్పాటుకు ప్రయత్నిస్తున్న కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీలపై ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. వారు కేరళలో బద్ధ శత్రువులని, కాని ఇతర రాష్ట్రాలలో 'చిరకాల ఉత్తమ మిత్రులు' (బిఎఫ్ఎఫ్‌లు) అని మోడీ పేర్కొన్నారు. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో బిజెపి రాష్ట్ర శాఖ పాదయాత్ర ముగింపులో మాట్లాడిన మోడీ

వివరాలు 2లో

# ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో నలుగురు నక్సల్స్ మృతి

**రాయపూర్,ఫిబ్రవరి 27(పిసిడబ్ల్యూ న్యూస్):** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మంగళవారం భద్రతా సిబ్బంది ఎదురు కాల్పులలో నలుగురు నక్సలైట్లు మరణించారు. జంగ్లా పోలీసు స్టేషన పరిధిలోని అటవీ ప్రాంతంలో ఈ కాల్పుల ఘటన చోటు చేసుకుంది. నక్సల్స్ కోసం వేర్వేరుగా జిల్లా రిజర్వ్ గార్డు(డిఆర్‌జి), సిఆర్‌పిఎఫ్ బృందాలు అడవిలో గాలింపు జరుపుతున్న సందర్భంగా డిఆర్‌జి గస్తీ బృందాలకు ఛోటే తుంగలి అటవీ ప్రాంత సమీపంలో నక్సల్స్ ఎదురుపడ్డారు. దీంతో వెంటనే అప్రమత్తమైన డిఆర్‌జి బృందాలు ఎదురు కాల్పులు జరిపాయి. ఎన్‌కౌంటర్ ప్రదేశం నుంచి ఇప్పటి వరకు నక్సల్స్‌కు చెందిన నాలుగు మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. నక్సల్స్ కోసం గాలింపు కొనసాగుతోందని ఆయన చెప్పారు.



## కాంగ్రెస్ నేతలను ఆ విషయంలో విడిచిపెట్టం.. కేటీఆర్ మాస్ వార్నింగ్

(మొదటి పేజీ తరువాయి)

తీసుకెళ్లాలని అన్నారు.

### కాంగ్రెస్ నేతలు ఆ మాట చెబితే తన్నేవారు

కాంగ్రెస్ నేతలు అసెంబ్లీ ఎన్నికల సమయంలో అందరికీ అన్నీ ఇస్తామని చెప్పి... ఇప్పుడు కొందరికే కొన్ని అంటున్నారని మండిపడ్డారు. సీఎం కల్లబొల్లి కబుర్లు కట్టిపెట్టి జనం సమస్యలు పరిష్కరించాలని కోరారు. తెలంగాణలో18 ఏళ్లు నిండిన కోటి 67 లక్షల మంది మహిళలు ఉన్నారని.. అందరికి రూ. 2500 పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్చి 17వ తేదీకు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 100 రోజులు నిండుతాయని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేకపోతే బొంద పెడతామని హెచ్చరించారు. మార్పు అని ఓటేస్తే రేవంత్ ప్రభుత్వం తమ కడుపు కొట్టిందని ఆటో డ్రైవర్లు బాధ పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కోటి 37 లక్షల 50 వేల కరెంట్ మీటర్లు ఉన్నాయని.. వాళ్లలో కొంత మందికి మాత్రమే గృహజ్యోతి ఇస్తామని చెబుతున్నారని అన్నారు. ఇదే విషయం ఎన్నికల ముందు చెబితే కాంగ్రెస్ నేతలను తన్ని పంపేవారని మందలించారు. సికింద్రాబాద్ పార్లమెంట్‌పై గులాబీ జెండా ఎగరాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

## ఎంపీ ఎన్నికల్లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా: బండి సంజయ్

(మొదటి పేజీ తరువాయి)

అవకాశం కల్పించింది అధిష్ఠానం. కాగా.. ఇప్పటికే ప్రచార పర్వాన్ని మొదలు పెట్టిన బండి సంజయ్.. ప్రజాహిత యాత్రను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో.. మంత్రి పొన్నం ప్రభాకర్ తనపై చేసిన వ్యాఖ్యలపై బండి సంజయ్ స్పందిస్తూ.. సంచలన వ్యాఖ్యలు చేశారు.ఎంపీ ఎన్నికల్లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని.. మళ్లీ ఎన్నడూ హిందూత్వం గురించి మాట్లాడబోనంటూ బండి సంజయ్ పేర్కొన్నారు. మరి.. కరీంనగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోతే పొన్నం ప్రభాకర్ తన మంత్రి పదవికి రాజీనామా చేసి.. రాజకీయ సన్యాసం చేస్తారా అంటూ సవాల్ విసిరారు. హుస్నాబాద్ ప్రజాహిత యాత్రలో మాట్లాడిన బండి సంజయ్.. తనను ఆడిపోసుకోవడమే కేటీఆర్, పొన్నం ప్రభాకర్ పనిగా పెట్టుకున్నారంటూ తీవ్రస్థాయి దుయ్యబట్టారు. తాను హామీలు అమలుపై ప్రశ్నిస్తే దాడులు చేయడమేంటని ప్రశ్నించారు. ఏం తప్పు చేశానని తనను అరెస్ట్ చేస్తారో చెప్పాలని ప్రశ్నించారు.పొన్నం ప్రభాకర్ తల్లిపై తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని బండి సంజయ్ చెప్పుకొచ్చారు. మంత్రి పొన్నం తన తల్లిని అడ్డం పెట్టుకుని రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయోధ్య అక్షింతలను రేషన్ బియ్యం అని పొన్నం ప్రభాకర్ అన్న మాట నిజం కాదా అని నిలదీశారు. హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి మోదీ సర్కార్.. రూ. 697 కోట్లు వెచ్చించిందని బండి సంజయ్ వివరించారు. ప్రజలపక్షాన పోరాడితే తనపై వందకుపైగా కేసులు పెట్టి జైలుకు పంపారన్నారు. పొన్నం ప్రభాకర్ ఏరోజైనా ప్రజల కోసం కొట్లాడారా అని నిలదీశారు. ఆరు గ్యారంటీలతో పాటు మేనిఫేస్టోలో ఇచ్చిన 423 హామీలను అమలు చేయాల్సిందేనని బండి సంజయ్ డిమాండ్ చేశారు.కొత్త రేషన్ కార్డులు ఇవ్వకుండా హామీలను అమలు చేయడమంటే ప్రజలను మోసం చేయడమేనని బండి సంజయ్ అభిప్రాయపడ్డారు. కేసీఆర్ పదేళ్లలో 5 లక్షల కోట్ల అప్పు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు నెలల్లోనే 10 వేల కోట్ల అప్పు చేసిందని బండి సంజయ్ దుయ్యబట్టారు.

## ఎన్నికల్లో ఓటమి తప్పదని వారికి తెలుసు: ప్రధాని మోడీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపక్షాల ధోరణిని ఆక్షేపించారు. దేశ పురోభివృద్ధి కోసం ప్రతిపక్షాల వద్ద రోడ్‌మ్యాప్ లేదని, అందుకే అవి రానున్న లోక్‌సభ ఎన్నికలలో గెలవలేమని దృఢాభిప్రాయంతో ఉన్నాయని, ఆ కారణంగానే వాటి నేతలు తనను దుర్భాషలాడుతున్నారని మోడీ ఆరోపించారు. 'కాంగ్రెస్, కమ్యూనిస్టులు కేరళలో పరస్పరం శత్రుభావంతో మెలగుతుంటాయి. కాని ఇతర రాష్ట్రాలలో అవి బిఎఫ్‌ఎఫ్‌లు అంటే చిరకాల ఉత్తమ మిత్రులు' అని ప్రధాని అన్నారు. కేరళ ముఖ్యమంత్రి (పినరయి విజయన్) అవినీతికి, కుంభకోణాలకు పాల్పడుతుంటారని కాంగ్రెస్ ఆరోపించిందని, వామపక్ష ప్రభుత్వాన్ని ఫాసిస్ట్‌గా ఆ పార్టీ అభివర్ణించిందని మోడీ చెప్పారు. 'అందుకు ప్రతిస్పందనగా కమ్యూనిస్టులు కాంగ్రెస్ కార్యకర్తలపై లాఠీచార్జి చేయించారని, ఆ పార్టీ పూర్వపు ప్రభుత్వాలకు వివిధ కుంభకోణాలలో ప్రమేయం ఉందని ఆరోపించారు. అయితే, కేరళ వెలుపల ఇండియా కూటమి సమావేశాలలో వారు కలసి కూర్చుంటారు, సమోసాలు, బిస్కట్లు తింటారు, తేనీరు తాగుతారు' అని మోడీ వాటి అసంబద్ధత గురించి ప్రస్తావిస్తూ చెప్పారు.'అందువల్ల తిరువనంతపురంలో వారు ఒక విషయం చెబుతారు. ఢిల్లీలో వేరే విధంగా మాట్లాడతారు. కేరళ ప్రజలు రానున్న లోక్‌సభ ఎన్నికలలో వారి నయవంచనకు సమాధానం ఇస్తారు' అని మోడీ అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలలో రెండు అంకెల సీట్లతో బిజెపిని ఆశీర్వదించాలని కేరళ ప్రజలకు మోడీ విజ్ఞప్తి చేశారు. వోటు బ్యాంకు కోణంలో ఏ రాష్ట్రాన్నీ బిజెపి చూడదని మోడీ నొక్కిచెబుతూ, గడచిన పది సంవత్సరాలలో ఇతర బిజెపి పాలిత రాష్ట్రాల వలె కేరళ అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనం పొందిందని ప్రధాని తెలియజేశారు. కేరళ ప్రజల కలలు, ఆకాంక్షల సాఫల్యానికి వీలుగా అన్ని విధాల కృషి చేస్తామని తాను గ్యారంటీ ఇస్తున్నానని మోడీ చెప్పారు.

# 'మహాలక్ష్మి', 'గృహ జ్యోతి' పథకాల ప్రారంభం...

(మొదటి పేజీ తరువాయి)

కట్టెలపొయ్యి నుంచి గ్యాస్ సిలిండర్ ను ఆనాడే తక్కువకు ఇందిరా గాంధీ ఇచ్చారు. యూపీఏ హయాంలో కాంగ్రెస్ దీపం పథకం తీసుకొచ్చింది. రూ.400 కేగ్యాస్ సిలిండర్ అందించింది. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక రూ.1200కు సిలిండర్ రేటు పెరిగింది. మోదీ గ్యాస్ ధరలు పెంచితే కేసీఆర్ సబ్సీడీ ఇవ్వలేదు. మా ప్రభుత్వం నిబద్ధతతో ఉంది.. ఎట్టి పరిస్థితుల్లో ఆరు గ్యారెంటీ లను అమలు చేస్తాం. ఎవరు ఎలాంటి శాపాలు పెట్టినా...అపోహలు ప్రచారం చేసినా పథకాలు ఆగవు. సోనియా గాంధీ హామీ ఇస్తే శిలాశాసనం. ఆమె ఇచ్చిన మాటను తూచా తప్పకుండా అమలు చేస్తుంది ఈ ప్రభుత్వం. తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచేలాగా పాలన చేస్తాం. ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటాం అని సీఎం రేవంత్ అన్నారు.

### ఉచిత విద్యుత్‌పై ఆ ప్రచారం నమ్మొద్దు: డిప్యూటీ సీఎం భట్టి

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీల స్కీమ్‌ను దేశం అంతా చూస్తోందని.. ఇదొక విప్లవాత్మకమైన ఆలోచన అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. "అమలుకాని ఆరు గ్యారెంటీల హామీ కాంగ్రెస్ ఇచ్చినట్లు బిఆర్ఎస్ మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండో రోజు నుంచే విమర్శలు చేస్తోంది. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల పాలు జేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమే. ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఆరు గ్యారెంటీ లను అమలు చేయాలని అందరం పట్టుదలతో ఉన్నాం. అరకొర నిధులతో జీతాలు ఇస్తూనే, పథకాలు అమలు చేస్తున్నాం.ఇప్పుడు ప్రారంభించిన గృహజ్యోతి, మహాలక్ష్మీ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలువబోతున్నాయి. అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించడమే ఇందిరమ్మ రాజ్యం అంటే. 200 యూనిట్లు అమలు అంటే కోతలు అని ప్రచారం చేస్తున్నారు. 200 యూనిట్ల వరకు రేపు మార్చి నుంచి ఎలాంటి ఆంక్షలు లేకుండా ఉచితంగా కరెంట్ ఇవ్వబోతున్నాం. అర్హత కలిగిన వారందరికీ ఉచిత 200 యూనిట్ల విద్యుత్ ఇస్తాం. బీఆర్ఎస్ నేతలు బోగస్ ప్రచారం చేస్తున్నారు.. వాటిని నమ్మొద్దు అని భట్టి పిలుపు ఇచ్చారు.

### ఇతర మంత్రులు..

భవిష్యత్తులో తెల్లకార్డు ఉండి ఎల్పీజీ కనెక్షన్ ఉంటే.. మహాలక్ష్మీ పథకం వర్తింపజేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం సుమారు 40 లక్షల మంది బల్ధిదారులున్నారని.. లబ్ధిదారుల జాబితాలో ఇప్పుడు లేనివారిని త్వరలోనే చేరుస్తామని చెప్పారాయన. మరో మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. ప్రభుత్వం కొలువుదీరాక రెండు పథకాలు.. ఇప్పుడు మరో రెండింటిని ప్రారంభించామని.. నూటికి నూరు శాతం అన్ని పథకాలు అమలు చేస్తామని అన్నారు.

# 300 ఎకరాల్లో జీనోమ్ వ్యాలీ ఫేజ్- 2

**- వికారాబాద్, మెదక్, నల్గొండ జిల్లాల్లో గ్రీన్ ఫీల్డ్ ఫార్మా క్లస్టర్లు - రూ. లక్ష కోట్ల పెట్టుబడులతో 5 లక్షల మందికి ఉద్యోగాలు - వైరస్ భయాలన్నింటికీ హైదరాబాద్ ప్రపంచానికి ఆశాదీపం - బయో ఏసియా సదస్సు 2024 లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**




**హైదరాబాద్,ఫిబ్రవరి 27(పిసిడబ్ల్యూ న్యూస్):** త్వరలోనే హైదరాబాద్ జీనోమ్ వ్యాలీ రెండవ ఫేజ్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్ మాదాపూర్‌లోని హైటెక్స్‌లో మంగళవారం ప్రారంభమైన హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్ బయో ఏషియా 2024 సదస్సును పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఈ ఏడాది జీనోమ్ వ్యాలీ ఎక్సెలెన్స్ 2024 అవార్డుకు ఎంపికైన నోబెల్ బహుమతి గ్రహీత ప్రొఫెసర్ గ్రెగ్ ఎల్.సెమెంజాను సిఎం అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి సెమెంజాకు అవార్డును అందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ "మూడు వందల ఎకరాల్లో రూ.2000 కోట్ల పెట్టుబడులతో జీనోమ్ వ్యాలీ ఏర్పాటు చేస్తాం. లక్ష కోట్ల పెట్టుబడులతో పది ఫార్మా విలేజీల ఏర్పాటు ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. దీంతో మౌళిక సదుపాయాలతో పాటు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అపారమైన అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. దీంతో రాష్ట్రంలో 5 లక్షల మందికి కొత్త ఉద్యోగాలు లభిస్తాయి. వికారాబాద్, మెదక్, నల్గొండ జిల్లాల్లో గ్రీన్ ఫీల్డ్ ఫార్మా సెక్టార్లలో ఈ ఫార్మా విలేజ్ లను ఏర్పాటు చేస్తాం. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఒక గంట ప్రయాణ దూరంలోని అత్యంత సమీపంలో వీటిని ఏర్పాటు చేస్తున్నందున ప్రపంచంలోని పారిశ్రామికవేత్తలందరికీ ఎంతో సదుపాయంగా ఉంటుంది.." అని సిఎం అన్నారు.కరోనా సమయంలో కోవిడ్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యానికి సంబంధించిన ఆందోళనలున్న పరిస్థితుల్లో హైదరాబాద్ వేదికగా జరుగుతోన్న బయోఏషియా సదస్సు కీలకంగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బయోసైన్స్ రాజధానిగా హైదరాబాద్ నేడు యావత్ మానవాళికి ఒక భరోసాగా నిలిచిందని పేర్కొన్నారు. వైరస్ భయాలను ధీటుగా ఎదుర్కోగలమనే నమ్మకాన్ని హైదరాబాద్ కలిగించిందని, ఇప్పుడు ప్రపంచంలో వినియోగించే ప్రతి మూడు వ్యాక్సిన్లలో ఒకటి హైదరాబాద్ లోనే ఉత్పత్తి అవుతోందని సిం గుర్తు చేశారు.ఆరోగ్య భద్రత విషయంలో ప్రపంచంలోని అందరి సమస్యలు ఒకేలా ఉన్నాయని కోవిడ్ నిరూపించిందని, అయితే సమస్యల పరిష్కారాలను కూడా మనం కలిసికట్టుగానే సాధించాలని సిఎం సూచించారు. ఒక్క బయో సైన్సెస్ లోనే కాదు, ఐటీ-సాఫ్ట్ వేర్, రీసెర్చ్, స్టార్టప్ రంగాలకు రాజధానిగా ఉన్న హైదరాబాద్ ను మరింత సమున్నతంగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు. అంతర్జాతీయ, దేశీయ సంస్థలు ఇక్కడ ఎలాంటి ఆటంకాలు లేకుండా కార్యకలాపాలు నిర్వహించేందుకు అవసరమైన అనుకూల వ్యవస్థలను బలోపేతం చేశామన్నారు. చిన్న స్టార్టప్ లు, పెద్ద కార్పొరేట్ కంపెనీలకు వారధిగా నిలిచే ఎంఎస్ఎంఈ రంగానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. " మీరు నింగిలోని తారల వద్దకు చేరాలని కలలు కంటే.. మిమ్మల్ని అక్కడికి తీసుకెళ్లే రాకెట్ లా మా ప్రభుత్వం పనిచేస్తుంది " అని సిఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇటీవల దావోస్ వేదికగా జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో తెలంగాణకు భారీ స్థాయిలో రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయని గుర్తు చేశారు. ఏటా 5 కోట్ల డోసుల వ్యాక్సిన్ల ఉత్పత్తే లక్ష్యంగా ప్రఖ్యాత టకేడా సంస్థ ఇక్కడి బయోలాజికల్-ఈ సంస్థతో కలిసి హైదరాబాద్ లో తయారీ కేంద్రం నెలకొల్పడాన్ని స్వాగతించారు. వైరస్ ల వల్ల ప్రపంచంలో నెలకొన్న భయాలకు హైదరాబాద్ నుంచి నమ్మకాన్ని కల్పిస్తున్నామని సీఎం అన్నారు. జర్మనీకి చెందిన మిల్టెనీ సంస్థ తన రీసెర్చ్ సెంటర్ ను హైదరాబాద్ లో ఏర్పాటు చేసిందని చెప్పారు. మానవాళికి మంచి చేసే చర్చలు, ముందడుగుతో హైదరాబాద్ బయో ఏషియా సదస్సు విజయవంతం కావాలని సిఎం ఆకాంక్షించారు.

### పెట్టుబడులకు తెలంగాణ అనుకూలం

పెట్టుబడులకు తెలంగాణ ఎంతో అనుకూలమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ తో పాటు జిల్లాల్లో కూడా పరిశ్రమలు స్థాపించడానికి ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తుందని ఆయన అన్నారు. బయో ఆసియా 2024 సదస్సు సందర్భంగా పలు దేశాల ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో హైదరాబాద్ లోని హెచ్ఐసిసిలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ భౌగోళిక స్థితిగతులు, ఇతర అంశాలపైన సిఎం రేవంత్ రెడ్డి వారికి వివరించారు. హైదరాబాద్ లో భిన్నత్వంలో ఏకత్వం ఉందని, శాంతిభద్రతలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్నారు.హైదరాబాద్ ఇప్పటికే ఐటీ, ఫార్మా రంగాల్లో లీడర్ గా ఉందని, మరిన్ని రంగాల్లో నెంబర్ వన్ గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకత్వ చొరవ కారణంగానే హైదరాబాద్ లో ఫార్మా విస్తరించిందన్నారు. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి తెలంగాణలోని ఏ ప్రాంతానికి వెళ్లడానికైనా గంటన్నర సమయం సరిపోతుందన్నారు. ద్వితీయ శ్రేణి పట్టణాల్లో కూడా పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. వచ్చే మూడేళ్లలో రీజనల్ రింగ్ రోడ్ ను పూర్తి చేస్తామన్నారు. హెల్త్ కేర్ రంగంలో పెట్టుబడులకు సిద్ధంగా ఉన్నామని వెస్టర్న్ ఆస్ట్రేలియా మంత్రి సాండర్సన్ తెలిపారు.కాగా భారతదేశంలో తొలి కమర్షియల్ ఆఫీస్ హైదరాబాద్ లోనే ప్రారంభిస్తున్నట్లు ఆమె సిఎం రేవంత్ రెడ్డికి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు వివరించారు. హెల్త్ కేర్, హెల్త్ టూరిజం, హెల్త్ స్కిల్లింగ్ ల్లో పెట్టుబడులకు అవకాశాలున్నాయని వెస్టర్న్ ఆస్ట్రేలియా ప్రతినిధులకు ముఖ్యమంత్రి రేవంత్, మంత్రి శ్రీధర్ బాబులు ఈ సందర్భంగా సూచించారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఎండి జెర్మీజూర్గన్స్ కూడా సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబులతో సమావేశమయ్యారు. తెలంగాణ వ్యవసాయ రంగంలో పెట్టుబడులను పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్, మంత్రి శ్రీధర్ బాబులు వారికి సూచించారు.ప్రధానంగా వ్యాపార పంటలపైన దృష్టి సారించాలన్నారు. తెలంగాణలో 26 రకాల పంటలను పండించగలిగే భూములున్నాయని వారు వరించారు. ఆర్గానిక్ ఉత్పత్తులకు భవిష్యత్తులో మంచి డిమాండ్ ఉందన్నారు. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ తయారు చేస్తున్నట్లు జెర్మీజూర్గన్స్ కు ముఖ్యమంత్రి తెలియజేశారు. గ్రీన్ హైడ్రోజన్ రంగంలో పెట్టుబడులు పెట్టాలని తనను కలిసిన బెల్జియం అంబాసిడర్ డెడిర్ వాండర్ హసక్ కు సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. సెమీకండక్టర్ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి మరికొందరు పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చారు. కావాల్సిన భూమితో పాటు ఇతర సదుపాయాలను కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారికి హామీ ఇచ్చారు.

# పేదలకు ఎక్కువ ఉపయోగం కలిగేలా ఆరు గ్యారంటీలు : భట్టి విక్రమార్క

**హైదరాబాద్,ఫిబ్రవరి 27(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలోని పేదలకు ఎక్కువ ఉపయోగం కలిగేలా ఆరు గ్యారంటీలను రూపొందించామని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం మరో రెండు గ్యారంటీలను ఇవాళ అమలు చేసింది. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా రూ.500 లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ స్కీములను ప్రారంభించారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ రూ.500 లకే గ్యాస్ సిలిండర్ స్కీము మహిళలకు చాలా ఊరట ఇస్తుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని 40 లక్షల కుటుంబాలకు గ్యాస్ సిలిండర్ పథకంలో లబ్ధి జరుగుతుందని అభిప్రాయపడ్డారు. లోపాలు గుర్తించి ఈ



పథకంలో మార్పులు చేసుకుంటూ వెళ్తామని చెప్పారు. త్వరలో నేరుగా లబ్ధిదారులు రూ.500 లకే గ్యాస్ సిలిండర్ పొందేలా ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వైపు దేశం మొత్తం చూస్తోందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా తయారైందని అసహనం వ్యక్తం చేశారు. ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ తాము ఇచ్చిన గ్యారంటీలను అమలు చేస్తున్నామన్నారు. ఇచ్చిన అన్ని గ్యారంటీలను అమలు చేసి తీరుతామని.. అందుకోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. మన దేశంలో కొన్నేళ్లుగా గ్యాస్ సిలిండర్ ధరలు భారీగా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పెరిగిన ధరల నుంచి సామాన్యులకు, మహిళలకు ఊరట ఇచ్చేందుకు గృహజ్యోతి పథకాన్ని ప్రకటించినట్లు తెలిపారు.

# ప్రతి ఒక్కరూ ఆర్థిక క్రమశిక్షణ కలిగి ఉండాలి

**- హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**హనుమకొండ జిల్లా స్టాపర్, ఫిబ్రవరి 27(పిసిడబ్ల్యూ న్యూస్):**ప్రతి ఒక్కరూ పొదుపును అలవాటు చేసుకుని, ఆర్థిక క్రమశిక్షణ కలిగి ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సీక్త పట్నాయక్ అన్నారు. మంగళవారం హనుమకొండ సుబేదారిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక అక్షరస్యత-అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆన్లైన్ లావాదేవీల పైన తప్పకుండా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆర్థిక మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు పొదుపును అలవాటు చేసుకోవాలని సూచించారు. ఆర్థిక అక్షరాస్యత అంశంపై మంచి కార్యక్రమాన్ని నిర్వహించారని కలెక్టర్ పేర్కొన్నారు. సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై విద్యార్థులు తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్



అబ్దుల్ హై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పొదుపును అలవాటు చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆర్థిక అక్షరాస్యత- అవగాహన పుస్తకాన్ని కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీని ప్రారంభించిన అనంతరం పాఠశాల నుంచి అదాలత్ కూడలి నుండి హంటర్ రోడ్డు మీదుగా పాఠశాల వరకూ విద్యార్థులు, అధికారులతో కలిసి కలెక్టర్ ర్యాలీగా సాగారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఎస్బిఐ రీజినల్ మేనేజర్ రఘునాథ్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఎం.హరి ప్రసాద్, బీసీ వెల్ఫేర్ డిడి రామ్ రెడ్డి, పశుసంవర్ధక శాఖ ఏడి డాక్టర్ శ్రీనివాస్, జిల్లా అగ్నిమాపక అధికారి భగవాన్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నెహ్రూ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# 59, 60వ డివిజన్‌ల నుండి పలువురు కాంగ్రెస్‌లో చేరిక

**హనుమకొండ జిల్లా స్టాపర్, ఫిబ్రవరి 27(పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ పశ్చిమలో 59, 60వ డివిజన్ నుండి వివిధ పార్టీలకు చెందిన పలువురు యువకులు మంగళవారం హన్మకొండ విశాల్ భవన్ లో జిల్లా సోషల్ మీడియా కో-ఆర్డి నేటర్ కేతిడి దీపక్ రెడ్డి, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ ముస్తాక్ నేహాల్ ఆధ్వర్యంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సంధర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీ లోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పేదల సంక్షేమం, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యం. ఇందిరమ్మ రాజ్య స్థాపనకోసం మన ముఖ్యమంత్రి తీసుకువచ్చిన ఆరు గ్యారంటీ పథకాలు ప్రజలకు ఎంతో దగ్గర చేసాయి. ప్రజల్లోకి ఈ పథకాలు చొచ్చుకు పోయాయి. కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన పథకాలకు ఆకర్షితులై ఈ రోజు యువత కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు.ఎలాగయితే మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో గెలిచి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకు వచ్చామో అలాగే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అందరు కలిసి కట్టుగా పని చేసి భారీ మెజారిటీ తో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ని గెలిపించుకొని రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిగా చేయడమే ధ్యేయంగా రాబోయే ఎన్నికలలో పనిచేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో టి.కార్తీక్ రెడ్డి, టి. మానికంట, వి అరుణ్ రావు, ఏ. సుమిత్ రెడ్డి, అభినయ్ రెడ్డి, సుందీప్ వర్మ. శ్రీ రామ్ రెడ్డి, పి . రేవంత్ రెడ్డి, జె. కరణ్, బి,సందీప్, ఏం. రంజిత్, బి. కార్తీక్, సచిన్, మొహమ్మద్ ఖలీల్, మొహమ్మద్ ఫహాద్, మొహమ్మద్ ప్రవీణ్, అఫ్జాల్ మియా, శశి. ఎస్.కే. ఫయీం, సయ్యద్



మునవ్వర్, అక్రం , నవీన్, సాబాజ్, సాయిరాంలు పార్టీ లో చేరారు. డివిజన్ అధ్యక్షులు రవి కిరణ్, అనుకోటి పున్నం చందర్, బొజ్జ సమ్మయ్య యాదవ్ మొహమ్మద్ అంకుష్, దేవన విష్ణువర్ధన్ రెడ్డి, సిరబోయిన సతీష్‌లు పాల్గొన్నారు.

# 470 మంది విద్యార్థినీలకు స్కాలర్షిప్‌ల అందజేత

**హనుమకొండ జిల్లా స్టాపర్, ఫిబ్రవరి 27(పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా పింగిలి ప్రభుత్వ ఉమెన్ కాలేజీలో.. మలబార్ గోల్డ్ , డైమండ్స్ తెలంగాణ స్టేట్ హెడ్ అజిష్ అహ్మద్ ఆధ్వర్యంలో.. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా 470 మంది విద్యార్థినిలకు స్కాలర్షిప్ లు పంపిణీ కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సీక్త పట్నాయక్, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ జా, హనుమకొండ, వరంగల్ డిఐఈఓ అధికారులు గోపాల్, మాధవరావు, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ చంద్రమౌళి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థినీలకు స్కాలర్షిప్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతిభ ఆధారంగా 470 మందికి స్కాలర్షిప్లు అందించగా.. ఇందులో ఒక్కొక్కరికి రూ. 6000 నుండి రూ. 8000 ల చొప్పున రూ. 37,90,000 స్కాలర్షిప్ల మొత్తాన్ని ప్రకటించారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 4500 మంది పేద విద్యార్థినీలకు ఎంపిక చేసి రూ. 8000 నుండి రూ. 10,000 వరకు స్కాలర్షిప్లు అందిస్తామని మలబార్ గ్రూప్ ప్రకటించింది.అనంతరం జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్, వరంగల్



పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ జా మాట్లాడుతూ.. చదువుతోనే అన్ని లక్ష్యాలను సాధించవచ్చుని, ఇప్పుడు విద్యలో మీ ప్రతిభ ఆధారంగానే స్కాలర్షిప్లు వచ్చాయని, భవిష్యత్తులో మీ ఉన్నత స్థాయి లక్ష్యాలు ఈ ప్రతిభతోనే నెరవేరుతాయి అని వారన్నారు. అదేవిధంగా మలబార్ మేనేజర్ క్రాంతి మాట్లాడుతూ.. మలబార్ గ్రూప్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ లో భాగంగా మంగళవారం 470 మంది విద్యార్థినీలకు వారి ప్రతిభా ఆధారంగా స్కాలర్షిప్లు అందించడం జరిగిందని, మహిళ సాధికారతే.. లక్ష్యంగా 20 సంవత్సరాలుగా మలబార్ గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 21,211 పేద కుటుంబాలకు రూ. 72.11 కోట్ల రూపాయలకు మించి నిధులను అందించారన్నారు. అలాగే ఓమ్స్ ఫర్ హోంలేష్ కార్యక్రమం కింద మలబార్ గ్రూప్ 730 మందికి పైగా వ్యక్తులకు ఇండ్ల నిర్మాణం కోసం ఒక్కొక్కరికి రూ. 50,000 చొప్పున ఆర్థిక సాయం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో మలబార్ మార్కెటింగ్ మేనేజర్ వంశీ, మలబార్ గ్రూప్ నిర్వాహకులు, ప్రభుత్వ కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు ఈవీఎంల పరిశీలన

**హనుమకొండ జిల్లా స్టాపర్,ఫిబ్రవరి 27(పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయంలో 25 అదనపు వీఎంలు (కంట్రోల్ యూనిట్లు)మొదటి దశ తనిఖీ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తనిఖీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ మహేందర్ జీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఈసీఐఎల్ ఇంజనీర్ల ఆధ్వర్యంలో అదనపు ఈవీఎంల తనిఖీ ప్రక్రియ కొనసాగగా వాటి వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. తనిఖీ ప్రక్రియను పరిశీలించారు. తనిఖీ ప్రక్రియకు సంబంధించిన పలు రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. అదనపు ఈవీఎంల మొదటి దశ తనిఖీ ప్రక్రియ అనంతరం మాక్ పోలింగ్ ను అధికారులు నిర్వహించారు.ఈ ప్రక్రియ అనంతరం అదనపు ఈవీఎంలను పోలీస్ భద్రత మధ్య వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని స్ట్రాంగ్ రూములకు తరలించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఏవో కుసుమ సత్యనారాయణ, ఎన్నికల విభాగం సుపరింటెండెంట్ ఏవిఎస్వి ప్రసాదరావు, నాయబ్ తహసిల్దార్లు కొండూరి సంతోష్, జన్ను శ్యామ్, దేవులపల్లి రామకృష్ణ, ఎన్నికల సిబ్బంది అన్వేష్, రవి, తదితరులతోపాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు నేహాల్, రజినీకాంత్, మణి, లక్ష్మణ్, సునీల్, జైపాల్ రెడ్డి, వెంకట్, సయ్యద్ ఫైజుల్లా పాల్గొన్నారు.



# ప్రజల ఆశీస్సులతో ఆరు గ్యారెంటీలు అమలు

**- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంతు సంతోష్**



**తొర్రూర్, ఫిబ్రవరి 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజల ఆశీస్సులు ఉంటే ఎవరైనా విజయం సాధించవచ్చు అని నిరూపించారు కాంగ్రెస్ పార్టీ నాయకులు. ప్రజల ఆశీస్సులతోనే ఆరు గ్యారంటీలు కూడా అమలుకు నోచుకున్నాయని కాంగ్రెస్ పార్టీ తొర్రూరు మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ తెలిపారు. ఆర్ గ్యారంటీల అమలు ప్రకటించిన వెంటనే తొర్రూరు పట్టణంలోని మహాత్మా గాంధీ విగ్రహం ఎదురుగా సీఎం రేవంత్ రెడ్డి ,పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు ప్రసంగిస్తూ గృహజ్యోతి పథకం 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, 500 కే గ్యాస్ సిలిండర్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు అమలు చేసి చూపారని అన్నారు. మహిళలకు కరెంటు కష్టాలు ఉండవని పేర్కొన్నారు .ఎమ్మెల్యే యశస్విని రెడ్డి , ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో గుర్తూరులో స్టీల్ డెవలప్మెంట్ సెంటర్ ను ఏర్పాటు చేయబోతున్నారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ఎస్ గజానంద్ , భూసాని రాము కాంగ్రెస్ నాయకులు హనుమాన్ల నరేందర్ రెడ్డి , జాటోత్ రవి నాయక్ తదితరులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

## మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసిన జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి మహమ్మద్ అంకుష్



**హనుమకొండ జిల్లా స్టాపర్, ఫిబ్రవరి 27(పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్‌లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి దామోదర్ రాజనర్సింహని,వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మహమ్మద్ అంకుష్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఆయన వెంట పార్టీ శ్రేణులు, నాయకులున్నారు.

## డిసిసి బ్యాంకులో సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులతో రివ్యూ సమావేశం



**ఆత్మకూర్, ఫిబ్రవరి 27(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆత్మకూర్ మండల కేంద్రంలోడి.సి.సి బ్యాంకులో బ్యాంకు పరిధిలోని సంఘాల అధ్యక్షులు, కార్యదర్శుల తో రివ్యూ సమావేశం మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆత్మకూర్ చైర్మెన్ ఏరుకొండ రవిందర్ గౌడ్ మాట్లాడూతూ... సంఘంలో తీసుకున్న రైతులు రుణాలు చెల్లించి రెన్యువల్ చేసుకొవాలని కోరారు. అదే విధంగా ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీలో భాగంగా 2 లక్షల పైగా ఉన్న రైతులు వద్ద పడ్డీలు చెల్లించి రుణమాఫీ కి అర్హులు అయ్యే అవకాశం ఉందని కావున రైతులు సత్వరమే చెల్లించి తమ రుణాలను రెన్యువల్ చేయించుకోవాలని తెలిపారు. కావున అధ్యక్షులు, సంఘ కార్యదర్శులు రైతులు వద్ద వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.నోడల్ అఫీసర్ హరిత బ్యాంక్ మేనేజర్ స్వేత, సూపర్వైజర్ రాజేష్, శాయంపేట చైర్మెన్ కె.శరత్ బాబు, సంఘ కార్యదర్శులు ఓంప్రకాశ్, రాజమోహన్, లక్ష్మయ్య, శ్రీనివాస్ సంఘాల యొక్క సిబ్బంది పాల్గొన్నారు.

## విజయ సంకల్ప బస్సు యాత్రను విజయవంతం చేయాలి

**- భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శి మొలుగూరి శ్రీనివాస్ ఛౌకీధార్**



**సంగెం, ఫిబ్రవరి 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ చేపట్టినటువంటి విజయ సంకల్ప బస్సు యాత్రను భారతీయ జనతా పార్టీ సంగెం మండల నాయకులు కార్యకర్తలు ఫిబ్రవరి 29వ తేదీన సాయంత్రం ఐదు గంటలకు పరకాల లో జరిగే స్ట్రీట్ కార్నర్ మీటింగ్ ను విజయవంతం చేయుటకు మోటార్ సైకిల్ పై ర్యాలీగా పరకాల చలివాగు దగ్గర స్వాగతం పలికి పరకాల బస్టాండ్ లో జరిగే స్ట్రీట్ కార్నర్ మీటింగ్ ను విజయవంతం చేయాలి భారతీయ జనతా పార్టీ బూత్ స్థాయి కార్యకర్తలు నాయకులు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీని అఖండ మెజార్టీతో గెలిపించుటకు మోడీ ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి గడపగడపకు తీసుకుపోయి ప్రజలను చైతన్య పరుస్తూ కేంద్రంలో నరేంద్ర మోడీ ముచ్చటగా మూడోసారి 400 సీట్లకు పైగా విజయం సాధించి అధికారంలోకి రావాలని, దానికి మన అందరి కృషి ఉండాలని, బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఆయన తెలిపారు.

## రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్‌ను కలిసిన కార్పొరేటర్ జక్కుల

**హనుమకొండ జిల్లా స్టాపర్, ఫిబ్రవరి 27(పిసిడబ్ల్యూ న్యూస్):** ఇటీవల నూతనంగా పార్లమెంట్ రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన సందర్భాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ లో మంగళవారం ఎం అనిల్ కుమార్ యాదవ్ ని, మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. జక్కుల రవీందర్ యాదవ్ 62వ డివిజన్ కార్పొరేటర్, రాష్ట్ర మైనార్టీ నాయకులు ఫాహిమ్, సిద్ధిరాజు యాదవ్, శివరాజ్ యాదవ్, ఇమ్రాన్‌లు పాల్గొన్నారు.



# వ్యవసాయ సహకార సంఘంలో వీగిపోయిన అవిశ్వాసం

**- వెల్లడించిన జిల్లా సహాయకత అధికారి వెంకటేశ్వర్లు**



**తొర్రూరు,నెల్లికుదురు ఫిబ్రవరి 27(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల లో ఈనెల 8వ తేదీన 9 మంది డైరెక్టర్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ నెల్లికుదురు సంఘం అధ్యక్షులు కాశం లక్ష్మీ చంద్రశేఖర్ రెడ్డి వీరితోపాటు ఉపాధ్యక్షులు గుగులోతు రామ్ సింగ్ పై ఇచ్చిన అవిశ్వాస తీర్మానం పై ఇచ్చిన నోటీసు పై తగు చర్యలు తీసుకునేందుకు 27వ తేదీ మంగళవారం రంగం కార్యవర్గ సమావేశాన్ని నెల్లికుదురు సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా సహాయకత అధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.. ఈ కార్యక్రమానికి సంఘం కార్యవర్గ సభ్యులు ఎవరు హాజరు కానందున అవిశ్వాస తీర్మానం నిర్వహించలేకపోయామని అన్నారు. ఇట్టి అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లుగా ప్రకటించారు.

# మహబూబాబాద్ జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శిగా తమ్మిశెట్టి



**బయ్యారం,ఫిబ్రవరి 27(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా యూత్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గా బయ్యారం మండలానికి చెందిన తమ్మిశెట్టి వెంకటపతి కి జిల్లా యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంకర అయ్యప్ప రెడ్డి,మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి నియమిస్తూ నియామక పత్రం అందజేశారు, ఈ కార్యక్రమంలో బయ్యారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంబాల ముసలయ్య యాదవ్, మాజీ టీపీసీసీ నాయకులు బయ్యారం మాజీ ఎంపీపీ గుగులోత్ కిషన్ నాయక్,మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ములకూరి వీరారెడ్డి, బయ్యారం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు, జూలకంటి, తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు ఆరోపణలు ఎక్కువ రోజులు ఉండవు.!

**- నరిశెట్టి పున్నం చందర్**




**ధర్మసాగర్, ఫిబ్రవరి 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** నాపై చేసిన తప్పుడు ఆరోపణలు ఎక్కువ రోజులు మనుగడలో ఉండవని ధర్మసాగర్ మండలం మలకపల్లి గ్రామవాసి నరిశెట్టి పున్నం చందర్ అన్నారు. మంగళవారం రోజున ఓ ప్రైవేట్ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పున్నం చందర్ మాట్లాడుతూ గతంలో తన పైన కొందరు వ్యక్తులు కావాలని మోసపూరిత ఆరోపణలు చేసి కేసులు పెట్టారు. నాపై ఉన్న కేసులు అబద్ధమని హైకోర్టు ఫిబ్రవరి 26న కేసుల ను కొట్టేసి ఒదని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పుడు ఆరోపణలు ఎక్కువ రోజులు ఉండవని తనకు న్యాయస్థానం మీద నాకు నమ్మకం ఉందని ఆయన అన్నారు. కోర్టు కేసు కొట్టి వేయడంతో సంతోషం వ్యక్తం చేశారు.

# భారీ వాహనాలతో అంబేద్కర్ విగ్రహానికి పొంచి ఉన్న ప్రమాదం

**- దారి మళ్లించమని కోరుతున్న స్థానికులు**





**తొర్రూరు,ఫిబ్రవరి 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** అందరూ ఆరాధ్య దేవుడిగా కొలుచుకుంటారు బాబా సాహెబ్ అంబేద్కర్‌డుని. అంతటి మహనీయునికి మండల చౌరస్తాలో విగ్రహాన్ని నేలకొల్పారు. ఒకనాడు చిన్నగా ఉన్న పల్లె దినదినాభివృద్ధిగా అభివృద్ధి చెందుతూ మండలంగా మారింది. ఈ గ్రామానికి 100 సంవత్సరాలు చరిత్ర నెలకొని ఉన్నది. ఇక్కడ పోలీస్ టానా, అతిథి గృహం ప్రభుత్వ పాఠశాల ఆనాడు నిర్మింపజేసిన గ్రామం. కాకతీయులు పరిపాలించిన ప్రాంతం ఇది. మహబూ బాబా ద్ జిల్లా కేంద్రం నుండి పాలకుర్తి నియోజకవర్గం లోని తొర్రూర్ రెవెన్యూ డివిజన్ కి వెళ్లే ప్రధా న రహదారిలో ఉన్న ఈ నెల్లికుదురు మండలం. స్థానికుడు సిపిఐ న్యూ డెమోక్రటిక్ పార్టీ సాయిలు ఈ విషయాలను వెల్లడించారు. మండల చౌరస్తాలో ఏర్పాటుచేసిన అంబేద్కర్ విగ్రహానికి వెనుక భాగంలో దారి వెడల్పు లేకపోవడం భారీ వాహనాలు తిరగలేక వాహన డ్రైవర్లు అనేక అవస్థలు ఎదు ర్కొం టున్నారని ఇది కాకుండా విగ్రహానికి క్రింది భాగంలో నిర్మించిన దిమ్మెను లారీలు ఢీకొనడంతో కొం తభాగం కూలిపోయిందని స్థానికులు ఈ విషయాన్ని పిసిడబ్లు దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు స్పందించిఅంబేద్కర్‌విగ్రహానికిముందునుండివాహనాలువెళ్లేవిధంగాఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

**- పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్**



**బయ్యారం,ఫిబ్రవరి 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర వ్యాప్తంగా రేపటి నుండి జరుగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ డిమాండ్ చేశారు. బయ్యారం మండలం లో ముఖ్య కార్యకర్తల సమావేశం లో పాల్గొని మాట్లాడుతూ కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు నష్టం జరగకుండా పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఎలాంటి అవక,తవకలు జరగకుండా ఎప్పటికప్పుడు జిల్లా కేంద్రాలలో ఉన్న పరీక్ష కేంద్రాలో కలెక్టర్, మండల కేంద్రాల్లో ఎమ్మార్వో,ఎంఈఓల పర్యవేక్షణ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మరియు వివిధ గ్రామాల నుంచి వస్తున్న విద్యార్థులకు సరైన సమయంలో బస్సు సౌకర్యం కల్పించాలని అన్నారు. పరీక్ష కేంద్రాలలో డాక్టర్ల పర్యవేక్షణకు ఉండాలని, అదే విధంగా ఒక్క నిమిషం ఆలస్యంగా నిబంధనను ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎండలు తీవ్రత ఉండటం వల్ల పరీక్ష కేంద్రాలలో మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు నాయకులు ప్రవీణ్, శివ, ప్రసాద్, అరవింద్, కృష్ణ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


# భగవద్గీత మీద అవగాహన



**ములుగు, ఫిబ్రవరి 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా గోవిందరావుపేట మండల కేంద్రంలోని చల్వాయి గ్రామం శ్రీ రామలింగేశ్వర బ్రహ్మసూత్ర శివలింగం శంకు చక్ర హనుమాన్ కమిటీ ఆధ్వర్యంలో ఏకల్ అభియాన్ స్వచ్ఛంద సమితికి చెందిన రామరథం దేశవ్యాప్తంగా గ్రామ గ్రామాన భగవద్గీత మీద అవగాహన తెలియపరుస్తూ 78వ ప్రచార వ్రతం తీసుకొని ప్రయాణం చేస్తూ మంగళవారం రోజు ములుగు జిల్లా గోవిందరావుపేట మండల కేంద్రంలోని చల్వాయి గ్రామంలో ఈ యొక్క అవగాహన ప్రచార వ్రతం గ్రామ ప్రజలకు భగవద్గీత పైన అవగాహన కల్పిస్తూ గ్రామంలో తిరగడం జరిగింది ఈ కార్యక్రమంలో శ్రీ రామలింగేశ్వర బ్రహ్మసూత్ర శివలింగం శంకు చక్ర హనుమాన్ ఆలయ కమిటీ అధ్యక్షులు వీరమాచినేని వెంకటేశ్వరరావు కార్యదర్శి మూల కుమార్ కోశాధికారి గింజిపెల్లి కిషోర్ గౌరవ అధ్యక్షులు నాం పూర్ణ చందర్ గౌరవ సలహా దారులు వల్లభనేని శ్రీనివాస్ పైడాకుల కృష్ణమూర్తి అంకం వినయ్ కుమార్ ఉపాధ్యక్షులు కాసర్ల రాంబాబు నరాల శ్రీనివాస్ రెడ్డి బైకాని ఓదేలు సన్నాయిల భిక్షపతి సహాయ కార్యదర్శి బిజ్జె సురేష్ పల్లపు కుమార్ ప్రచార కార్యదర్శి ధరావత్ రంజిత్ సభ్యులు గూడూరు శ్రీనివాస్ బండమీడి అశోక్ మెడిపెల్లి సురక్షిత్ సామ కృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాబోయ్ ఈ బాధలు మేము భరించలేం ?

**- వీధి కుక్కల దాడిలో 20 గొర్రెలు మృతి**



**తొర్రూర్,దంతాలపల్లి ఫిబ్రవరి 27(పిసిడబ్ల్యూ న్యూస్):** రూపాయి రూపాయి పోగుచేసుకొని దాచుకున్న సొమ్మును కూడా జీవనోపాధికి కోరకు గొర్రెలను కొనుగోలు చేసాం. ఇంటిదగ్గర దొడ్డిలో ఉన్న గొర్రెల మందపై ఆదివారం రాత్రి వీధి శూరకాలు దాడి చేయడంతో 20 గొర్రెలు మృత్యువాత పడినాయి. వివరాలలోకి వెళితే దంతాలపల్లి మండలం బొడ్లాడ గ్రామంలోని గౌరవ వీరయ్య యాదవ్ అనే వ్యక్తి కి సంబంధించిన గొర్రెలు అవి. తన జీవనోపాధి గొర్రెలు కావడంతో దిక్కుతోచని స్థితిలో సర్వం కోల్పోయి అ.కుటుంబం బోరున విలపించ సాగింది.సర్వం కోల్పోయిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని ఆ కుటుంబ సభ్యులు ప్రభుత్వ అధికారులను వేడుకుంటున్నారు. గ్రామంలో ఉన్న వీధి శనకాలను తక్షణమే గ్రామంలో లేకుండా చేయాలని అవి అలాగే గ్రామంలో కొనసాగితే వీధిన తిరిగే చిన్న పిల్లలు కూడా మృత్యువాత పడే అవకాశాలు లేకపోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి గ్రామంలో శునకాలు లేకుండా చేయాలని పేర్కొంటున్నారు.

# ఆ బావిని పూడ్చే విధంగా చర్యలు తీసుకోండి...!

**- ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్‌కు మిర్యాల లచ్చయ్య వినతి ..**



**కురవి, ఫిబ్రవరి 27(పిసిడబ్లూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా కురవి నుండి ఖమ్మం వెళ్ళే దారిలో కురవి గురుకులం దగ్గర రోడ్డు పక్కన ప్రమాద కరంగా ఉన్న బావిని వెంటనే పూడ్చి వేయాలని కురవి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మిర్యాల లచ్చయ్య ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్ ను కోరారు..ఆ బావి కురవి మాజీ సర్పంచ్ నూతక్కి నర్సింహారావు కు చెందినదని ఆ బావిలో ప్రమాదవశాత్తు పడి ఇప్పటి వరకు పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారని లచ్చయ్య మహాశివరాత్రి జాతర సమీక్ష లో ఎమ్మెల్యే దృష్టి కి తీసుకెళ్ళడం తో స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్ సంబంధిత అధికారులను పిలిచి ఆ బావిని పూడ్చే విధంగా యజమాని తో మాట్లాడాలని కోరారు.... వేరే చోట బావి తీసుకునే విధంగా యజమానికి నష్ట పరిహారం చెల్లించాలని అధికారులను ఎమ్మెల్యే అదేశించారు.

# బిజెపి విజయసంకల్పయాత్రను విజయవంతం చెయ్యండి

**- తెలంగాణ పార్లమెంటు ఎన్నికల్లో ఏ పార్టీతో బిజెపికి పొత్తులు లేవు**

**- రామ రాజ్యం స్థాపనకు కృషి చేస్తున్న మోడీ**




**పరకాల, ఫిబ్రవరి 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** బిజెపి సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరారు. మంగళవారం రోజు పరకాల పట్టణంలో బిజెపి పట్టణ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు మార్త బిక్షపతి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బిజెపి కాంటెస్ట్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పగడాల కాళీ ప్రసాదరావు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పెసరు విజయ్ చందర్ రెడ్డి, డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రపంచంలో భారతదేశం ఒక అగ్ర భాగాన నిలబడాలంటే దేశ ప్రధాని నరేంద్ర మోడీతోనే సాధ్యమని అన్నారు. విజయ సంకల్ప యాత్ర భద్రాది కొత్తగూడెం రామాలయం నుండి వరంగల్ భద్రకాళి టెంపుల్ వరకు జరుగుతుందని దానిని ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పరకాల పట్టణంలో ఈనెల 29 సాయంత్రం కార్నర్ సమావేశం ఉంటుందని ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి పాల్గొన నున్నారు. ఈ సంకల్ప యాత్ర ముఖ్య ఉద్దేశం దేశంలో బిజెపి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించే ఉద్దేశంతో జరుగుతుందని దీనిలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికలలో బిజెపి ఏ పార్టీతో పొత్తు పెట్టుకోవట్లేదని తెలంగాణ రాష్ట్రంలో 17 పార్లమెంట్ సభ్యులను గెలుపొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో రామరాజ్య స్థాపనకు మోడీ తోనే సాధ్యమైతుందని అన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ కపట నాటకాలు ప్రజలకు తెలుసు అని అన్నారు. తెలంగాణ ప్రజలను మభ్యపెట్టి గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలందరూ ఈసడించుకుంటున్నారని అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రానికి ఎన్ని అప్పులు చేసిందో ప్రజలందరికి తెలుసు అని గుర్తు చేశారు. దేశ రక్షణకు బిజెపితోనే సాధ్యమైతుందని ప్రతి ఒక్క పౌరుడు బిజెపి పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నారని అన్నారు.రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుజ్జ సత్యనారాయణ రావు,దేవునూరి మెగనాద్,మంద ఐలయ్య,అసెంబ్లీ కన్వీనర్ ములుక ప్రసాద్,జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్పీ జయంత్ లాల్,కార్యదర్శి ఏర్రం రామన్న, ప్రధాన కార్యదర్శులు గాజుల నిరంజన్, కుక్కల విజయ్,కౌన్సిలర్ కొలనుపాక బద్రయ్య, బేజ్జంకి పూర్ణచారి,రూరల్ అధ్యక్షులు పుట్ట రవీందర్, ఆకుల రాంబాబు దండు సురేష్,పాలకుర్తి తిరుపతి,దామ సతీష్ మార్త రాజబద్రయ్యా,సిరంగీ సతీష్ మారెడుగొండ బాస్కరా చారి,బండి రవి, కాసగాని మంతెన సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# పాడే మోసిన సీనియర్ జర్నలిస్ట్ అంబాల ప్రభాకర్ (ప్రభు)



**జమ్మికుంట, ఫిబ్రవరి 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** జమ్మికుంట పట్టణానికి చెందిన ప్రముఖ జర్నలిస్టు సమ్మెట సదానందం తండ్రి జమ్మికుంట నాయి బ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షులు సమ్మెట లింగయ్య సోమవారం రోజున అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న సీనియర్ జర్నలిస్ట్ అంబాల ప్రభాకర్ (ప్రభు) మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి అంతక్రియలలో పాల్గొని పాడే మోశారు. అదే విధంగా డప్పు కళాకారులతో డప్పు కొడుతూ దరువేశారు. ఈ సందర్భంగా అంబాల ప్రభాకర్ (ప్రభు) మాట్లాడుతూ సమ్మెట లింగయ్య జమ్మికుంట పట్టణంలో నాయి బ్రాహ్మణ సంఘాన్ని స్థాపించి గత 45 సంవత్సరాలుగా నాయి బ్రాహ్మణ సంఘానికి విశేష సేవలందిస్తూ సంఘం అభివృద్ధికి తోడ్పడ్డారనీ, లింగయ్య మరణించడం వారి కుటుంబానికి, బంధువులకు, నాయి బ్రాహ్మణ సంఘా సభ్యులకు తీరని లోటని అన్నారు.

# కొండా సురేఖను కలిసిన దూపదీప నైవేద్య అర్చకులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ధూప దీప నైవేద్యం సంఘం అధ్యక్షులు దౌల్తాబాద్ వాసుదేవ శర్మ ఆధ్వర్యంలో హైదరాబాద్ సెక్రటేరియట్ నందు దేవదాయ శాఖ మంత్రివర్యులు శ్రీమతి కొండా సురేఖ ని మర్యాదపూర్వకంగా కలిసి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 6700 దేవాలయాలలో నిత్య దూపదీప నైవేద్య చేస్తున్నా అర్చకులకు రావలసిన బకాయి వేతనాలను మంజూరు చేసినందుకుగాను కృతజ్ఞతలు తెలుపుతూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని కాంక్షిస్తూ వేదమంత్రోచ్ఛారణలతో ఆశీర్వదించడం జరిగినది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరునగరి వెంకటాద్రి స్వామి,రాష్ట్ర కోశాధికారి నందనం హరికిషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఫణి కుమార శర్మ,జగిత్యాల జిల్లా అధ్యక్షులు ఓరగంటి మాధవాచార్య రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు వేగ్గళం సంతోష్ శాస్త్రి, బసవ లింగప్పస్వామి, హరికీర్తిఅమరేశ్వర్ శర్మ, లక్ష్మీ నరసయ్య, శివకుమార్ ఆచార్య, రాజేశ్వర శర్మ, చంద్రశేఖర్, శివప్రసాద్,శ్రీనివాసచార్య,వెంకటేశ్వర్లు, విద్యాసాగర్మరియు వివిధ జిల్లాల అర్చకులు పాల్గొన్నారు.



# పాదయాత్రతో చట్టసభల్లో బిసి వాటా సాధించాలి

**- సామాజిక, ప్రజా సంఘాల పిలుపు**



**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఉద్యమాల కేంద్రం, త్యాగాలకు పుట్టినిల్లు తెలంగాణ నుండి ప్రారంభమయ్యే బి.సి మహా పాదయాత్రను విజయవంతం చేసి చట్టసభల్లో బిసి వాటా సాధించాలని ఆల్ ఇండియా ఒబిసి నాయకులు, వివిధ సామాజిక సంఘాల ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో చట్టసభల్లో బి సి వాటా సాధనకై మహా పాదయాత్ర విజయవంతం చేయడానికి ఏర్పాటు చేసిన సామాజిక, ప్రజా సంఘాల నాయకుల రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు నాయకులు పాల్గొని పాదయాత్ర గోడ పత్రికలను, కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్, తెలంగాణ బి.సి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్, హిందూ బి.సి మహాసభ వ్యవస్థాపక అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వర్, డాక్టర్ పుంజాల వినయ్ కుమార్, బి.సి చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు రమణ, జాక్ వైస్ చైర్మన్లు వెలుగు వనిత, ఏటిగడ్డ అరుణ పటేల్, పటేల్ వనజ, తెలంగాణ బి.సి జనసభ అద్యక్షులు రాజారాం యాదవ్, తెలంగాణ పెరిక సంఘం రాష్ట్ర అసోసియేట్ అద్యక్షులు సుంకరి ఆనంద్, డాక్టర్ కంటే సాయన్న, బి.సి సేన నాయకులు వాసు కె యాదవ్ తదితర నాయకులు పాల్గొని మాట్లాడారు. భారతదేశ సమాజహితం కోసం ఎంతో శ్రమ చేస్తున్న బి.సి కులాలకు చరిత్రలో ఈ దేశాన్ని ఏలిన చరిత్ర ఉందని, ప్రజల హక్కుల కోసం, అధికారం కోసం పోరాడిన వీరుల చరిత్ర ఉందని ఆ వీరుల స్ఫూర్తితో చట్టసభల్లో బిసి వాటా సాధించడానికి ప్రతి ఒక్క బిసి ప్రతినబూనాలని పిలుపునిచ్చారు. సకల సామాజిక రంగాల్లో మనమెంతమందిమో మనకంత వాటా దక్కాలంటే చట్టసభల్లో బి.సి వాటాతోనే సాధ్యమవుతుందని అన్నారు. చట్టసభల్లో బి.సి వాటా సాధన కోసం మార్చి 1న మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మిరిగోన్ పల్లి మహా వీరుడు పండుగ సాయన్న గ్రామం నుండి మొదలై బి.సి వీరులు కొండా లక్ష్మన్ బాపూజీ, బెల్లి లలితక్క, శ్రీకాంతచారి, మారోజు వీరన్న, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మల గ్రామాల నుండి బి.సి మహా వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గ్రామం ఖిలాశాపూర్ వరకు మార్చి 20 న చేరుకుంటుందని తెలిపారు. 360 కిలోమీటర్ల మేర జరుగు ఈ పాదయాత్రకు ప్రతి గ్రామంలో బిసిలతో పాటు సామాజిక, ప్రజా సంఘాల వారు, ప్రగతిశీలవాదులు మద్దతుగా నిలవా లని విజ్ఞప్తి చేశారు. మాజీ కేంద్ర మంత్రి, మాజీ గవర్నర్ పుంజాల శివశంకర్ ఏడవ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి ఆయన గొప్పదనం గూర్చి మాట్లాడారు. శివశంకర్ స్ఫూర్తితో చట్టసభల్లో వాటా సాధిస్తామని నినదించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఒబిసి నాయకులు చాపర్తి కుమార్, సింగారపు అరుణ, బుల్లెట్ వెంకన్న, ఏడుకొండలు, చంద్రకళ, రోజా నేత, పర్వత సతీష్ కుమార్, దుబ్బకోటి ఆంజనేయులు, బత్తుల రాంనర్సయ్య, పంతుల మల్లయ్య, ఆది సంజీవ, సద్గుణ, లీలావతి, గిరగాని బిక్షపతి, ఎర్ర శ్రీహరి, పాపాని నాగరాజు, దేశం మహేష్, సుజ్జి, కల్యాణి, అబ్దుల్ రషీద్, నగిరి ప్రవీణ్ కుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నేతలపై అకారణంగా అక్రమ కేసులు

**- థర్డ్ డిగ్రీ ఉపయోగించిన ఆత్మకూరు ఎస్ఐ దుర్గాప్రసాద్‌ను సస్పెండ్ చేసిన సిపి అంబర్ కిషోర్ ఝాకి కృతజ్ఞతలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే చల్లా**

**- రేపు చేపట్టిన ధర్నా కార్యకరం విరమించుకుంటున్నట్లు వెల్లడి**



**ఆత్మకూరు, ఫిబ్రవరి 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** 25న ఆత్మకూరు మండలం అగ్రంపాడ్ జాతరలో సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను కుటుంబ సభ్యులు మరియు కొంత మంది బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి దర్శనం చేసుకొని వస్తున్న క్రమంలో కొంత మంది నాయకులు జై తెలంగాణ నినాదం చేశారనే నెపంతో ఉద్దేశపూర్వకంగా,అధికార పార్టీ నాయకుల మెప్పుకోసం అక్రమ కేసులు బనాయించి, థర్డ్ డిగ్రీ ఉపయోగించి బి.ఆర్.ఎస్. నాయకులను విచక్షణా రహితంగా కొట్టిన ఆత్మకూర్ ఎసై దుర్గాప్రసాద్ ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కి పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సిపి నిర్ణయంతో పరకాల నియోజకవర్గం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు వారు తెలిపారు.అదేవిధంగా ఇట్టి కేసును మరింత లోతుగా దర్యాప్తు జరిపి ఇందులో భాగస్వాములైన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సిపి ని చల్లా ధర్మారెడ్డి కోరారు. సిపి నిర్ణయంతో రేపు అనగా తేదీ.28 న ఆత్మకూరు మండల కేంద్రంలో చేపట్టిన ధర్నా కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు వారు తెలిపారు. అదేవిధంగా ఈ సంఘట జరిగినప్పటి నుండి మాతో పాటు ఉంటూ మాకు మా కార్యకర్తలకు అండగా ఉన్న మాజీ ఉప ముఖ్యమంత్రి,స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అధికార పార్టీ నాయకుల మెప్పుకోసం అకారణంగా కేసులు పెట్టి ప్రజలను,ఇతర పార్టీల నాయకులను,కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేసే పొలిసు అధికారులకు సిపి నిర్ణయం ఒక గుణపాఠం లాంటిదని పేర్కొన్నారు.పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలు ఎవరు భయపడాల్సిన పనిలేదని మీకు అండగా ఉండి కంటికి రెప్పలా కాపాడుకుంటాలని చల్లా ధర్మారెడ్డి అన్నారు. ప్రతిపక్షంలో ఉన్న బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులను ఎన్ని ఇబ్బందులకు గురిచేసిన ప్రజల సమస్యలపై పోరాటం చేస్తామని తెలిపారు.

# వర్ధన్నపేటలో వరకట్న వేధింపులకు వివాహిత మృతి

**వరంగల్,ఫిబ్రవరి 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. స్థానికుల సమాచారం ప్రకారం.. గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు కుమార్తె శృతి మంగళవారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. తమ బిడ్డ మృతికి అత్తింటి వరకట్న వేధింపులే కారణమని శృతి కుటుంబ సభ్యులు ఆరోపించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పుస్తకాలు, బ్యాగుల పంపిణీ







**సంగెం, ఫిబ్రవరి 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** రోటరీ క్లబ్ వరంగల్ సౌజన్యంతో సంగెం మండలంలోని మొండ్రాయి, గొల్లపల్లె గ్రామలలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచిత నోట్ బుక్స్,స్కూల్ బ్యాగులు, స్టేషనరీ దాదాపు 25 వేలు వెచ్చించి వితరణ కార్యక్రమం రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మామిడాల రమేష్ బాబు, బి ఆనందరావు,ప్రోగ్రాం కోఆర్డినేటర్ అనంతుల కుమారస్వామి ఆధ్వర్యంలో విద్యార్థులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ మాజీ సర్పంచ్ మెరుగు మల్లేశం ముఖ్య అతిథిగా మొండ్రాయి మాజీ సర్పంచ్ గూడ కుమారస్వామి మొండ్రాయి సేవా సమితి నాయకులు కక్కెర్ల వీరస్వామి కాంగ్రెస్ నాయకులు వేల్పుల కుమారస్వామి, విద్యార్థుల తల్లిదండ్రులు పెండ్లి రమేష్ యూత్ సభ్యులు సంఘ సేవకులు పరికి మోహన్, పరికి మహేందర్, పరికి యాకయ్య, పరికి దయాకర్, పరికిరాజు, లక్కరాజు, విద్యార్థిని విద్యార్థులు,తల్లిదండ్రులు గ్రామ ప్రజలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మజ ఉపాధ్యాయ బృందం సుజాత, కమరునిస అంగన్వాడీ టీచర్ వెంకటలక్ష్మి మధ్యాహ్న భోజన తయారీ సిబ్బంది,పాల్గొనడం జరిగింది.

# బయ్యారంలో జామాయిల్ తోట దగ్ధం...

**- వెంటనే స్పందించిన పోలీస్,అగ్నిమాపక శాఖ,ప్రెస్ క్లబ్ సభ్యులు**



**బయ్యారం,27(పిసిడబ్ల్యూ న్యూస్):** మండల కేంద్రము శివారులో జామాయిల్ తోట దగ్ధమైంది, కాకతీయ నగర్ శివారులోని ఆరోగ్య ఉప కేంద్రం సమీపంలో గల చల్లగుండ్ల వెంకటనారాయణ, చల్లగుండ్ల వెంకటేశ్వర్లు లకు చెందిన వ్యవసాయ భూమి లో గల జామాయిల్ తోట మధ్యాహ్న సమయంలో మంటలు



అంటుకున్నాయి.గమనించిన స్థానికులు మంటలు అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ మంటలు అదుపులోకి రాకపోవడంతో బయ్యారం ఎస్ఐ కి, స్థానిక ప్రెస్ క్లబ్ కు సమాచారం ఇవ్వడంతో మహబూబాబాద్ ఫైర్ స్టేషన్ కు సమాచారం అందించారు,వెంటనే స్పందించిన ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకునీ మంటలను ఆర్పారు. సమీపంలోనే నివాస గృహాలు ఉండడంతో స్థానికులు భయాందోళన చెందారు.పోలీసులు, ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించి మంటలు ఎక్కువగా వ్యాప్తి చెందకుండా నివారించి ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా అపాగలిగారు. ఇది ఇలా ఉండగా దగ్ధమైన జామాయిల్ సుమారు 8 ఎకరాలకు నష్టం వాటిల్లిందనీ రైతులు వాపోయారు.

# మహాత్మ గాంధీజీ విగ్రహం ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**- ఖమ్మం నగర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గోళ్ల రాధాకృష్ణమూర్తి**



**ఖమ్మం, ఫిబ్రవరి 27(పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** సిద్దిపేట మండలం బక్రీద్ చెప్యాలా గ్రామం లో జాతిపిత మహాత్మా గాంధీజీ విగ్రహాన్ని కొందరు దుండగులు ధ్వంసం చేయడం చాలా బాధాకరమని గాంధేయవాదులు దీనిని ఖండించాలని గోళ్ల రాధాకృష్ణమూర్తి అన్నారు . భారతదేశ స్వాతంత్ర పోరాటంలో మహాత్మా గాంధీ పోషించిన పాత్ర ప్రపంచానికి ఆదర్శమని అలాంటి మహనీయుని పట్ల కొందరు దుండగులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడడం పట్ల ప్రజాస్వామ్యవాదుల మనోభావాలు దెబ్బతింటున్నాయని నిందితులపై అరకొర చర్య లవల్ల ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయని కాబట్టి అధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడే వారిని కఠినమైన శిక్షలు విధించి భవిష్యత్తులో ఎవరు కూడా ఇలాంటి చర్యలకు పాల్పడకుండా ఉండేటట్లు చూడాలని కోరారు . ఈ సందర్భంగా ఖమ్మం నగర ఆర్యవైశ్య సంఘ పాలకవర్గం కార్యవర్గం గుమ్మడవెల్లి శ్రీనివాస్ , మాసట్టి వరప్రసాద్ , దేవకి శ్రీనివాస్ , బోర్ల పుల్లారావు , గుంటుపల్లి దివాకర్ గుప్తా , రాయపూర్ రవికుమార్ , రాయపూడి జయరాం , ఎడమ కంటి రామారావు , విన్నమూరి వెంకట సుబ్బారావు, ఖాజా వెంకటేశ్వరరావు, ఊటూరి లక్ష్మీనరసింహారావు తదితరులు ఈ సంఘటన ను తీవ్రంగా ఖండించారు.

# పదవ తరగతి విద్యార్థులకు మానసిక స్థైర్యం కొరకు అవగాహన సదస్సు



**పెద్దపల్లి జిల్లా,సుల్తానాబాద్ ఫిబ్రవరి 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో జెడ్‌పిహెచ్‌ఎస్ బాలుర హై స్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు మానసికంగా ఒత్తిడి తగ్గించి, పరీక్షలకు ధైర్యంగా ప్రిపేర్ అయ్యేవిధంగా ప్రభుత్వ వైద్యశాల సూపర్డెంట్ డాక్టర్ రమాదేవి ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగింది. జెడ్పిహెచ్‌ఎస్ హెచ్‌ఎం ప్రభుత్వ వైద్యశాల సైకియాట్రిస్ట్ డాక్టర్ సాధ్వి మైథిలి, సూపర్డెంట్ డాక్టర్ రమాదేవి, ఎన్‌సిడి కౌన్సిలర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంక్ సిబ్బంది అధ్వర్యంలో 2కే రన్ నిర్వహణ

**- లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేష్**





**పెద్దపల్లి జిల్లా, ఫిబ్రవరి 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆర్థిక అక్షరాస్యత వీక్ 2024లో భాగంగా మంగళవారం పెద్దపల్లిలో 2 కే రన్/వాక్- థాన్ అమర్ నగర్ నుండి అయ్యప్ప టెంపుల్ వరకు ర్యాలీ నిర్వహించటం జరిగిందని లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేష్ తెలిపారు.అనంతరం పెద్దపల్లి లోని బాలికల హై స్కూల్ లో బ్యాంకర్లు పాఠశాల విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్‌లు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేసారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, బ్యాంక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాహితం యాత్రను కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మ దహనం

**గంగాధర,ఫిబ్రవరి 27(పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలో గంగాధర మండలంలోని మధురానగర్ చౌరస్తాఈ సందర్భంగా అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన 6 గ్యారంటీలను నెరవేర్చడంలో విఫలమవుతున్న నేపథ్యంలో ప్రజల దృష్టిని మల్చడం కోసమే ఈరోజు కరీంనగర్ ఎంపీ సంజయ్ కుమార్ గారు చేపడుతున్న ప్రజాహితం యాత్ర వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక తట్టుకోలేక ఎలాగైనా యాత్రను అడ్డుకోవాలని ఉద్దేశంతోనే ఈరోజు ఈ రాళ్ల దాడికి పాల్పడ్డారని ఈ సందర్భంగా అన్నారు, మంత్రి పొన్నం ప్రభాకర్ గారు కాంగ్రెస్ పార్టీలో నాయకులను యాత్రను అడ్డుకోమని చెప్పడం వలన ఇలా జరిగిందని అన్నారు, గతంలో బిఆర్ఎస్ అలంబించినటువంటి విధానాన్ని ఈరోజు కాంగ్రెస్ పార్టీ కూడా కొనసాగిస్తుందని ఈ సందర్భంగా అన్నారు.ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ పెరుకా శ్రవణ్ కుమార్,మండల అధ్యక్షులు కోలా అశోక్ కుమార్,చేనేత సెల్ జాయింట్ కన్వీనర్ శ్రీపతి రాజేంద్రప్రసాద్, కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు పెంచాల రాములు,మండల ఉపాధ్యక్షులు గుండేటి మల్లేశం,మండల ప్రధాన కార్యదర్శి రేండ్ల శ్రీనివాస్, బొమ్మ కంటి రాజిరెడ్డి,వొడ్నాల రాజు,మండల దళిత మోర్చా అధ్యక్షులు తల రాజశేఖర్,బీజేవైఎం మండల అధ్యక్షులు దయ్యాల ప్రణయ్ కుమార్, బీజేవైఎం మండల ఉపాధ్యక్షులు సుంకరి అనిల్ కుమార్,బిజెపి నాయకులు హర్ష రాజు,అటికం పరుశరాములు, పృథ్వీ గౌడ్,బీజేపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

